క్లుప్తంగా

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న రజని, హేవిత

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల్లో చిరునవ్వులు పూయించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా గురువారం స్థానిక హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో మదపల్లెకు చెందిన విజయకుమార్ భార్య రజని, కుమార్తె హేవితలు కేశాలు దానం చేశారు. క్యాన్సర్ బాధితులకు కేశాలు ఇవ్వాలన్న ఉద్దేశంతో దానం చేసినట్లు వారు తెలిపారు. ఒకేసారి తల్లి,కుమార్తెలు ఇవ్వడం సంతోషంగా ఉందని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్ధిక్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కిరణ్, చైతు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



శెట్టి సీతారాం

కురబలకోట : యువ కాపునాడు రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడిగా అంగళ్లుకు చెందిన శెట్టి సీతారాంను నియమించారు. ఈ మేరకు గురువారం జాతీయ కాపునాడు అధ్యక్షులు గాళ్ల సుబ్రమణ్యం నియామక పత్రం పంపారు. తనకు ఇచ్చిన కాపునాడు పదవికి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా సీతారాం తెలిపారు.

గాలి,వాన బీభత్సం



నేలరాలిన మామిడి కాయలను సేకరిస్తున్న రైతు రమణ

తంబళ్లపల్లె : మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలి,వాన బీభత్సం సృష్టించింది. మామిడితోటలో కాయలు నేలరాలి అపారనష్టం జరిగింది. మండలంలో 27.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఎఎస్ఓ శ్రీదుర్గా తెలిపారు. గాలి,వానతో తంబళ్లపల్లె, కోసువారిపల్లె, పంచాలమర్రి, ఎర్రసానిపల్లె, రేణుమాకుపల్లెలో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

జనసేన నేత సుధాకర్‌ను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీనివాసులు

కేవీపల్లె : పేద వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్న జనసేన నాయకుడు సుధాకర్‌ను అరెస్ట్ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ అమృతపురి శ్రీనివాసులు, దళిత ప్రజా సంఘాల నాయకులు ముల్లంగి చంద్రయ్య అన్నారు. గురువారం కేవీపల్లెలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో సుధాకర్ ఇసుక, మట్టి అమ్ముకుని కోట్లు సంపాదించాడని ఆరోపించారు. ప్రస్తుతం జనసేన పార్టీ పేరు చెప్పుకుని పేద వర్గాలను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బడుగు బలహీన వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్న సుధాకర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మల్లికార్జున, శేషాద్రిబాబు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

తంబళ్లపల్లె : మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ నందకుమార్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. గంగిరెడ్డిపల్లెలో కూలీలు చేస్తున్న పారంపాండ్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. కూలీలు కోరిన వెంటనే పనులు చూపడం, బాధ్యతగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్త్రీశక్తి భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, కూలీలు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. పండ్లు, పూలతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఏపీఓ అంజనప్ప, జేఈ మహేష్, జీఐఎస్ ఇంజినీర్ నాగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

17, 18న ఉరుసు

చిట్వేలి : హజరత్ జనాబ్ సయ్యద్ షా సాదిక్ వలీ ఖుదస్సిరహు ఉరుసు మహోత్సవాన్ని ఈనెల 17, 18వ తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సయ్యద్ జిలానీ బాషా హుసేని ముత్తవల్లి ఆస్థానయే సాదిఖీయ గురువారం తెలియజేశారు.

భక్తుల కొంగుబంగారం పోలేరమ్మ

- నేటి నుంచి తిరునాల
- మూడు రోజుల పాటు ఉత్సవాలు



గుర్రంకొండలో కొలువు దీరిన పోలేరమ్మ



గ్రామదేవత పోలేరమ్మ ఆలయం

గుర్రంకొండ : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా శ్రీపోలేరమ్మతల్లి విరాజిల్లుతున్నారు. గుర్రంకొండ మేజర్ పంచాయతీ గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాల ఉత్సవాలు ఈనెల 16నుంచి 18 వరకు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. గుర్రంకొండను నవాబులు పరిపాలించే కాలంలో వారి చేత పూజలందుకున్న చల్లని తల్లి శ్రీ పోలేరమ్మ. మతాలకు అతీతంగా పోలేరమ్మ ముస్లిం, నవాబుల చేత కూడా ఘనంగా పూజలందుకున్నారు. అంతటి ఘన చరిత్ర కలిగిన శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయంలో ఈనెల 16న (శుక్రవారం) కోటలోని శ్రీ శిలేమాతమ్మకు, కొత్తపేటలోని శ్రీపోలేరమ్మ తల్లులకు మహిళలు దివిటీలు, బోనాలు ఘనంగా సమర్పించనున్నారు. 17న (శనివారం) రాత్రి తిరునాల ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రంగురంగుల చాందినీ బండ్లు మేళతాళాలతో ఊరేగించనున్నారు. ఆలయ పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 18 తేదీ (ఆదివారం) పగలు తిరునాల జరుగుతుంది. ఈ సందర్భంగా అమ్మవారికి పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాల్లో ఉట్టికొట్టే కార్యక్రమం జరుగుతుంది. తిరునాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. రాత్రి గంగమ్మతల్లి పెళ్లి సంబరాలు నిర్వహించిన అనంతర తిరునాల ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు తిలకించడానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివస్తారు.

గంగమ్మ జాతర చాటింపు



ఎనుపోతుకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించే కోర్టులో గంగమ్మ జాతర చాటింపు గురువారం నిర్వహించారు. స్థానిక కోర్టు ఆవరణలోని గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. గంగమ్మ జాతర చాటింపు పురస్కరించుకుని ఎనుపోతుకు పూజలు చేశారు. వచ్చే నెల 3వతేదీ రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు మార్పురి చిన్నరెడ్డప్ప తెలిపారు. 4వ తేదీ (బుధవారం) పగలు తిరునాల జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి రంగస్వామి, కరుణాకర్‌నాయుడు, దేవేంద్ర, భవానీప్రసాద్, మార్పురి మల్లికార్జున, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ



ఊంజల్‌సేవలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ మండపంలో ఉత్సవ విగ్రహాలను ఊయలపై ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు మంత్రోచ్చరణలతో పూజలు నిర్వహించారు. ఊయల ఊపుతూ స్వామి కీర్తనలు ఆలపించారు. అనంతరం రాత్రి శయనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర, ఆలయ సిబ్బంది రాజశేఖర్, అంకన్న తదితరులు పాల్గొన్నారు. సంస్కృతి, హరికథ, భజన, లలిత సహస్రనామాలు, ప్రవచనాలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేకం



కుంభాభిషేకం చేస్తున్న వేద పండితులు

బి.కొత్తకోట : మండలంలోని గట్టులో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ ఉత్సవాల ముగింపులో భాగంగా.. గురువారం శిఖర ఆలయ కుంభాభిషేక కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ గోపురంపై అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో వివిధ కార్యక్రమాలు జరిపారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చన, అభిషేకాలు, మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఆలూరి సుబ్రమణ్యం, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామస్వామి మండల పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ ఇందిరమ్మకాలనీలో గురువారం సీతారామస్వామి ఆలయంలో మండల పూజలు వైభవంగా జరిగాయి. ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, అభిషేకం, హోమం, శిఖర కలశాభిషేకం నిర్వహించారు. వేదపండితులు రవిస్వామి, ప్రవీణ్‌స్వామి నిత్యాభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బండపల్లి ఈశ్వరమ్మ, ఏపిడబ్ల్యుజె రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లి అక్కులప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి



మండల సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కలకడ : మండలంలోని అన్ని గ్రామాలలో వేసవి కాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల వారిగా జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ శాఖల వారి సమస్యలు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు స్పందించాలని ఆదేశించారు. ఉపాధి హామీలో చేసిన పనులకు కూడా నిధులు విడుదల కాలేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కోన పంచాయతీలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరినా పట్టించుకోలేదని సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మరిన్ని పైపులు, కుళాయిలు ఏర్పాటు చేసి పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరారు. పంచాయతీ నిధులు విడుదల కాకుంటే విద్యుత్ దీపాల ఏర్పాటు, స్కీంబోర్ మరమ్మతులు పంచాయతీలు చేపట్టలేవని గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు నిధులు విడుదల కాకపోవడం దారుణమన్నారు. అన్ని శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినించగా, గ్రామాలలో మంచినీటి సమస్య రాకుండా తీసుకుంటున్న ప్రణాళికలు తెలియజేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ సమస్యలు, ఆక్రమణలపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ పనికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు జల్లా క్రిష్ణకుమారి, ఈశ్వర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, డాక్టర్ పురుషోత్తంనాయుడు, సర్పంచ్‌లు విశ్వనాథ, వెంకటరమణ, అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు



మాట్లాడుతున్న ఏపీఎం సాంబశివ

రామసముద్రం : ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు జరుగుతుందని ఏవో మోహన్‌కుమార్ తెలిపారు. రామసముద్రం వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సభ్యులు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న వ్యవసాయ పద్ధతుల్లో రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల భూసారం తగ్గి సాగు ఖర్చు పెరుగుతుందన్నారు. అంతే కాకుండా ఆ పంట ఉత్పత్తులను తినడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతారన్నారు. ఏపీఎం సాంబశివ మాట్లాడుతూ రసాయనిక వాడకం నివారించడానికి ప్రకృతి వ్యవసాయం చేయడమే ఏకైక మార్గమని మహిళా సభ్యులకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఘనద్రవ జీవామృతం తయారీ, పిచికారి కోసం కాషాయాల తయారీ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బావాజాన్, రమాదేవి పాల్గొన్నారు.

వైద్య,ఆరోగ్య సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం



పీలేరు తాలూకా కార్యర్గానికి నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ

పీలేరు రూరల్ : వైద్య ఆరోగ్య సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 3194 పని చేస్తున్నట్లు ఆ యూనియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎ.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పీలేరులో యూనియన్ పీలేరు తాలూకా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షులుగా టి.విద్యాసాగర్, వైస్ ప్రెసిడెంట్ టి.రెడ్డెమ్మ, మునిలక్ష్మీ, వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా ఆర్.చిన్నప్ప, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.అరుణ, పి.యుగంధర్, ఎస్.పంకజం, కోశాధికారిగా ఆర్.శివప్రసాద్ బాబుతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ కుసుమకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామల ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

జెడ్‌హెచ్‌డీసీ భూములను పేదలకు పంచాలి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ భూములు కబ్జాలను తొలగించి అర్హులైన పేద దళితులకు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జెడ్‌హెచ్‌డీసీ భూముల గ్రామాల పేదలకు లీజు పట్టాలు గతంలో మంజూరు చేశారన్నారు. దీంతో వారు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. అయితే కొందరు భూమి సాగు చేయకుండా ఖాళీగా ఉంచారని, దీంతో కబ్జాదారులు కన్ను వాటిపై పడిందన్నారు.

మూలస్థానమ్మ జాతర ఖరారు

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన శ్రీ మూలస్థానమ్మ ఆలయ వార్షిక జాతర నిర్వహణ విషయంలో నెలకొన్న సందిగ్ధం తొలగింది. జాతర నిర్వహణకు సంబంధించి రెండు వర్గాల వారు వేర్వేరుగా జాతర తేదీలను ప్రకటించారు. ఈ మేరకు జాతరకు బందోబస్తు విషయమై స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో జోక్యం చేసుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని పిలిచి సంప్రదింపులు జరిపారు. అయితే గ్రామస్తుల సమక్షంలో ఆలయంలో సమావేశమై తీర్మానించుకోవడానికి ఇరువర్గాల వారు సమ్మతించారు. ఈ మేరకు గురువారం ఆలయ ఆవరణలో సమావేశమైన ఇరువర్గాలు, గ్రామస్తులు కలిసి చర్చించిన అనంతరం జూన్ నెల 7, 8, 9 తేదీలలో జాతర నిర్వహణకు తీర్మానించారు. అలాగే ఆలయ ఆవరణలోని దాతల పేర్లకు వేసిన పెయింటింగ్ తొలగించడంతోపాటు, గత ఐదేళ్లలో ఆలయ నిర్వహణ, ఆదాయ ఖర్చులను బహిరంగపరచాలని, ఆలయంలో చోరీకి గురైన అమ్మవారి వస్తువుల విషయం తేల్చాలని, తరువాతనే జాతర ఉత్సవాలు ప్రారంభించాలని కూడా గ్రామస్తులు, పెద్దలు తీర్మానించారు. దీంతో మూలస్థానమ్మ ఆలయ జాతర విషయంలో నెలకొన్న సందిగ్ధం తొలగినట్లయింది.

టౌన్‌బ్యాంక్‌లో డిపాజిట్లకు అదనంగా 0.5 శాతం వడ్డీ

- టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్

మదనపల్లె రూరల్ : వందేళ్ల ఘనచరిత్ర కలిగిన మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ గణనీయమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని, 100 కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా ముందుకెళుతోందని చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ తెలిపారు. గురువారం టౌన్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో ప్రజలు డిపాజిట్ చేసిన మొత్తం రూ.94 కోట్లు ఉందన్నారు. ఇందులో ఆర్‌బీఐ నిబంధనల మేరకు 70 శాతం వరకు రుణాలు ఇచ్చేందుకు పరిమితి ఉండటంతో మదనపల్లె, బీకే.పల్లె, పుంగనూరు బ్రాంచీల్లో రూ.64 కోట్ల వరకు లోన్లు ఇచ్చామన్నారు. దీన్ని మరింతగా పెంచి, ప్రజలకు చేరువయ్యేందుకు డిపాజిట్ల సేకరణ చేయాలని పాలకవర్గం నిర్ణయించిందన్నారు. పట్టణంలోని ఇతర బ్యాంకులతో పోలిస్తే టౌన్‌బ్యాంక్‌లో డిపాజిట్లపై అధికవడ్డీ ఇస్తున్నామన్నారు.

100 కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా అడుగులు

టౌన్‌బ్యాంక్‌కు 100 కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా పెట్టుకుని, నెలరోజుల్లోపు బ్యాంకులో చేసే లాంగ్‌టర్మ్ డిపాజిట్లపై అదనంగా 0.5 శాతం వడ్డీని ప్రోత్సాహకంగా ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. అందులో భాగంగా మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో 1-2 ఏళ్లు దాటిన డిపాజిట్లకు ప్రస్తుతం 7 శాతం ఇస్తుండగా, దాన్ని 7.25 శాతానికి పెంచుతున్నామన్నారు. 2-3 ఏళ్ల డిపాజిట్లకు గతంలో 7.5 శాతం ఉంటే.. ప్రస్తుతం 8 శాతం, మూడేళ్లకు పైన చేసే డిపాజిట్లకు 8.5 శాతం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అలాగే సీనియర్ సిటిజన్స్‌కు ఎప్పటిలానే ఇస్తున్న 0.5 శాతానికి అదనంగా మరో 0.5 శాతం కలిపి ఇస్తామన్నారు. నెలలోపు ఒకే మొత్తంగా 15 లక్షలు డిపాజిట్ వేసిన సీనియర్ సిటిజన్స్‌కు 9.5 శాతం చొప్పున, లక్షకు నెలకు రూ.792, రూ.కోటి డిపాజిట్‌కు ప్రతి నెలా రూ.75 వేలు అందిస్తామన్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే టౌన్‌బ్యాంక్‌లో 2 శాతం అదనంగా డిపాజిట్లపై వడ్డీ ఇస్తున్నందున పట్టణ ప్రజలందరూ తమ పొదుపు సొమ్మును డిపాజిట్ చేసి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలన్నారు.

15 రోజుల్లో యూపీఐ సేవలు

15 రోజుల్లో టౌన్‌బ్యాంక్‌లోనూ యూపీఐ సేవలను ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. 1924లో స్థాపించిన టౌన్‌బ్యాంక్ పట్టణ ప్రజల ఆదరాభిమానాలతో వందేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న నేపథ్యంలో శతాబ్ది వేడుకలను జూన్‌లో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఏరియా ఆఫ్ ఆపరేషన్ కింద ఇప్పటివరకు టౌన్‌బ్యాంక్ ఆధ్వర్యంలో పుంగనూరు, మదనపల్లె పట్టణాల్లో మాత్రమే రుణాలు మంజూరు చేసే వారమని, రాయలసీమ వ్యాప్తంగా ఎక్కడైనా రుణాలు ఇచ్చేలా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. టౌన్‌బ్యాంక్ బ్రాంచీల విస్తరణలో భాగంగా పీలేరు, కలికిరిలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, దీంతోపాటు మరో 2 ప్రాంతాల్లో మొత్తం 4 నూతన బ్రాంచీలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ డైరెక్టర్‌లు ముక్తియార్‌ఖాన్, పసుపుపాడి రవి, ఆకులకృష్ణమూర్తి, రాటకొండ సోమశేఖర్, భాస్కర, దేవేంద్రబాబు, నిరంజన్, నాదెళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

వంకలు, వాగులు వదలని కూటమి నాయకులు

- సీటీఎంలో ప్లాట్లు వేసినా పట్టించుకోని అధికారులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



వాగులో ఆక్రమణలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె రూరల్ : కూటమి నాయకులు చివరకు వాగులు, వంకలను విడిచిపెట్టకుండా ఆక్రమించేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆరోపించారు. సీపీఎం కార్యకర్తలతో కలిసి గురువారం సీటీఎంలో పర్యటించిన ఆయన, స్పిన్నింగ్ మిల్లు ఉన్నటువంటి ప్రాంతంలో రియల్టర్లు వంక భూములను ఆక్రమించి ప్లాట్లుగా వేసి ఉండటం గమనించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్వే నంబర్ 744, 745, 795ల గుండా ప్రవహించే రెండు వాగులను, నేతాజీకాలనీ నుంచి వచ్చే మురుగునీటి కాల్వలను పూర్తిగా పూడ్చివేసి ప్లాట్లుగా మారుస్తుంటే, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తిరుపతి రహదారికి ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువను ఆక్రమించడం వల్ల రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. డ్రైనేజీ నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల భూములను రెసిడెన్షియల్ భూములుగా మార్పు చేయకుండా, లేఅవుట్ అప్రూవల్ తీసుకోకుండానే ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. భూకబ్జాలు సహించేది లేదన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా టీడీపీ నాయకుల ఆక్రమణలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వాగుభూములను పరిరక్షించాలని, లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అశోక్, నరసింహ, రమణ, జయరాం, అఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు మళ్లీ వాయిదా



ప్రజలకు సర్దిచెబుతున్న ఏఎస్‌ఐ భాస్కర్

బి.కొత్తకోట : స్థానిక గ్రామ దేవత నలవీర గంగాభవానీ ఆలయానికి చెందిన మాన్యం భూమి, వాణిజ్య గదుల లీజుకు గురువారం నిర్వహించిన వేలం పాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. వీటిని వేలం ద్వారా లీజుకు ఇచ్చేందుకు ఈవో మునిరాజ, ఇన్‌స్పెక్టర్ శశికుమార్ నిర్ణయించారు. ఆలయంలో వేలంపాటల నిర్వహణకు సిద్ధం కావడంతో స్థానికులు వద్దని కోరారు. వాణిజ్య గదులను ఖాళీ చేయించినట్టుగానే మాన్యం భూమిలో లీజు పొందుతున్న వారిని కూడా ఖాళీ చేయించాకే వేలం నిర్వహించాలని పట్టుబట్టారు. అధికసంఖ్యలో ప్రజలు హాజరవడంతో ఏఎస్‌ఐ భాస్కర్ సిబ్బందితో వేలంపాటల వద్దకు చేరుకుని నచ్చజెప్పారు. ఉద్రిక్త పరిస్థితులను సృష్టించవద్దని కోరారు. తర్వాత మాన్యం భూమిలో లీజుకు ఉంటున్న వారి వద్దకు వెళ్లిన అధికారులు ఖాళీ చేయాలని సూచించారు. తర్వాత ఇదే విషయాన్ని ప్రకటించి త్వరలో వేలంపాటల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రజల సహకారంతోనే పరిశుభ్ర రాజంపేట



చెత్త సేకరణపై ఆరా తీస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట : పట్టణంలో డోర్ టు డోర్ చెత్త సేకరణకు సంబంధించి ప్రజలతో నేరుగా కలిసి తెలుసుకోవడం జరుగుతోందని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలో చెత్త సేకరణ ప్రక్రియపై ఆయన దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యంలో భాగంగా ఇంటి వద్ద చెత్తబండ్లు వస్తున్నాయా లేదా అని ప్రజల వద్ద ఆరా తీశారు. చెత్త వేర్వేరుగా ఇవ్వడం వల్ల పునఃప్రయోజనానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. పరిసరాల శుభ్రతకు ఇది ఎంతో అవసరమన్నారు. తడి చెత్తను గ్రీన్, పొడిచెత్తను బ్లూ బిన్‌లో ఇవ్వాలన్నారు. పట్టణం పరిశుభ్రంగా మారాలంటే పట్టణవాసులు పురపాలక సంఘానికి సహకరించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శుక్రవారం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్ సమావేశం ఉంటుందన్నారు.

మార్కెట్ కమిటీ ఏర్పాటు

కలికిరి: కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. కమిటీ చైర్మన్‌గా జి.మాలతి, వైస్ చైర్మన్‌గా షేక్ మహమ్మద్ సనావుల్లాతోపాటు కలికిరి, కలకడ మండలాలకు చెందిన 13 మందిని సభ్యులుగా నియమించారు. కలికిరి పీఏసీఎస్ చైర్మన్‌గా, వ్యవసాయ శాఖ ఏడీఏ, కలకడ బాలయ్యగారిపల్లి సర్పంచ్, జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారికి సభ్యులుగా అవకాశం కల్పించారు.

కొనసాగిన విచారణ

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వారపుసంత, దినసరి మార్కెట్, జంతువధశాల గుత్తల సొమ్ము రూ.29.50 లక్షల సొమ్ము స్వాహాపై గురువారం కమిషనర్ ప్రమీల విచారణ జరిపారని తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి ఆర్‌ఓ పల్లవి, సంబంధిత ఉద్యోగులను విచారణ చేసినట్టు సమాచారం. అప్పట్లో గుత్తల సొమ్మును తీసుకున్న ఉద్యోగి ఆన్‌లైన్ చెల్లింపు చేయకుండా తీసుకున్న సొమ్ముకు చేతిరాతతో రశీదులు ఇవ్వడం, దీనిపై గుత్తదారుడు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన అంశాలు, నిధులు జమ కాకపోవడం తదితర అంశాలపై సుదీర్ఘంగా విచారణ చేసినట్టు తెలిసింది.

ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

నందలూరు : మండలంలోని మారుమూల ప్రాంతమైన ఎర్ర చెర్లోపల్లి (వైసీ పల్లి) ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడినట్లు ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు, ఈఓపీఆర్‌డీ సునీల్‌కుమార్‌లు తెలియజేశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ వార్డు మెంబర్లు హాజరుకాని కారణంగా ఎన్నిక వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ఎన్నిక జరిగే తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

దక్షిణ ఫౌండేషన్‌కు విద్యార్థుల ఎంపిక

రాజంపేట : దేశవ్యాప్తంగా దక్షిణ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన పరీక్షలో జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే విద్యాలయం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గత మార్చిలో ఎంపిక పరీక్షలు నిర్వహించారన్నారు. ఐఐటీల్లో ప్రవేశం కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. రాబోయే రెండు సంవత్సరాల పాటు కర్నూలు, కర్ణాటకలోని బెంగళూరు, కేరళలోని కొట్టాయం నవోదయ విద్యాలయాల్లో ఐఐటీ కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.